RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

| Malkajgiri | Volume: 2 | Issue: 266 | Friday, January 10, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/- |
|---|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక : 266 | శుక్రవారం, జనవరి 10, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /- |



విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్ నెంబర్: 99637 08331


## భవిష్యత్తు యుద్ధంలో కాదు.. బుద్ధుడిలో ఉంది : ప్రధాని మోడీ



**భువనేశ్వర్:** మానవుడి భవిష్యత్తు యుద్ధంలో లేదని .. బుద్ధుడిలో ఉందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. అశోకుడు ఖడ్గంతో సామ్రాజ్య విస్తరణకు అవకాశం ఉన్నా బౌద్ధం స్వీకరించారని గుర్తు చేశారు. గురువారం ఒడిశా లోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 18 వ ప్రవాస భారతీయ దినోత్సవ కార్యక్రమంలో రష్యా, ఇజ్రాయెల్ పేర్లు ప్రస్తావించకుండా ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒడిశాలో అడుగడుగునా వారసత్వం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి వ్యాపారులు సుమత్రా, బాలి, జావా వంటి ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. " భారత్ ప్రజాస్వామ్యానికి కేవలం తల్లి లాంటిది మాత్రమే కాదు.. అది మన జీవితాల్లో భాగం..విదేశాల్లో జీవించేవారు భారత్‌కు రాయబారులుగా నేను చూస్తాను. భారత్ నుంచి యువత పూర్తి నైపుణ్యాలతో విదేశాలకు వెళ్లేలా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జీ 20 సందర్భంగా దేశ వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి భారత్ వైవిధ్యాన్ని ప్రపంచానికి తెలియజేశాం. మనవారసత్వ , విభిన్న సంస్కృతులను ప్రపంచం గమనిస్తోంది. భారత్ స్వాతంత్ర్యం సాధించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాసులుకూడా తోడ్పడ్డారు. ప్రవాస భారతీయులు వచ్చే ఏడాది ఈ ఉత్సవానికి వచ్చే సమయంలో కనీసం ఐదుగురు విదేశీ మిత్రులను తమతోపాటు తీసుకురండి. భారత్ కేవలం యువ దేశమే కాదు.. నిపుణులైన యువకుల దేశం. భారత్‌కు విశ్వబంధువుగా గుర్తింపు ఉంది. దానిని మరింత బలోపేతం చేయాలి. " అని మోడీ ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. మహాకుంభ్, సంక్రాంతి, లోహిర్, మాగ్ బిహు వంటి పండగల సీజన్‌లో ప్రవాస భారతీయ వేడుకలు జరగడం విశేషమన్నారు. ఈ సందర్భంగా ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షుడు క్రిస్టీనే కార్ల వీడియో సందేశం పంపించారు. ఆమె భారత్ పురోగతిని కొనియాడారు.

**ప్రవాసి భారతీయ టూరిస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం**

ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రవాసి భారతీయ ఎక్స్‌ప్రెస్‌రైలును భువనేశ్వర్‌లో గురువారం ఉదయం 10.45 గంటలకు జెండా ఊపి మోడీ రిమోట్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ ఇలా అన్నారు. " మిత్రులారా.. మేం మీ సౌలభ్యం , సౌకర్యానికి చాలా ప్రాముఖ్యత ఇస్తాం. మీ భద్రత,శ్రేయస్సు, మా మొదటి ప్రాధాన్యత. మన విదేశీ భారతీయులు ఎక్కడ ఉన్నా , సంక్షోభ సమయాల్లో వారికి సహాయం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం. నేటి భారత విదేశాంగ విధానానికి మార్గదర్శక సూత్రాలలో ఇదీ కూడా ఒకటని పేర్కొన్నారు. రాబోయే అనేక దశాబ్దాల వరకు భారత దేశం ప్రపంచం లోనే అత్యంత యువ, అత్యంత నైపుణ్యం కలిగిన జనాభా కలిగిన దేశంగా ఉంటుంది. నైపుణ్యం కలిగిన ప్రతిభావంతుల కోసం ప్రపంచ డిమాండ్‌ను తీర్చగల సామర్థం భారత దేశానికి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మార్ఝీ తదితరులు పాల్గొన్నారు.

## తప్పు జరిగింది.. క్షమించండి : డిప్యూటీ సీఎం పవన్



**తిరుపతి:** తిరుపతి తొక్కిసలాట ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. తిరుపతి స్విమ్స్, రుయా ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిరుపతి తొక్కిసలాట ఘటనపై కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో పొరపాటు జరిగిందని.. బాధ్యత తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. దీనికి చేతులు జోడించి క్షమాపణలు కోరుతున్నా అని పవన్ అన్నారు. ఈ ఘటనకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి బాధ్యత వహించాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ఈఓ, అడిషనల్ ఈఓ, చైర్మన్‌లపై ఉంది. మృతుల కుటుంబాల వద్దకు వెళ్లి వారిన పరామర్శించి, ధైర్యం చెప్పే బాధ్యత టీటీడీ పాలక మండలి తీసుకోవాలి అని అన్నారు. టికెట్ కౌంటర్ల వద్ద క్యూ లైన్లో ఉన్న భక్తులను, రద్దీని నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారని... పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరగాలి అని పేర్కొన్నారు.


## తొక్కిసలాట బాధితులకు పవన్ కల్యాణ్ పరామర్శ



**తిరుపతి:** తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రమాద ప్రదేశాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు.. నేటి మధ్యాహ్నం విజయవాడ నుంచి విమానంలో తిరుపతికి చేరుకున్న ఆయన నేరుగా బైరాగిపట్టెడ పద్మావతీ పార్క్ వెళ్లి అక్కడ ఉన్న వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ జారీ కేంద్రం వద్ద తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, డీఎస్పీ చెంచుబాబులతో మాట్లాడారు. భక్తులను క్యూలైన్లలోకి ఒకేసారి ఎందుకు వదిలారు? అధికారులను ప్రశ్నించారు పవన్. హైవేకు దగ్గరగా ఉండటంతో భక్తులు పద్మావతీ పార్కుకు భారీగా వచ్చారని తెలిపారు.. అనంతరం ఆయన తిరుపతి స్విమ్స్ , రుయా ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. భాదితుల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.. వారిని అన్ని విధాల ఆదుకుంటామని పవన్ వారికి హామీ ఇచ్చారు.

## డిఎస్పీ అత్యుత్సాహం వల్లే తొక్కిసలాట ఘటన.. సిఎం చంద్రబాబుకు నివేదిక

**తిరుపతి:** తిరుమలలో తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. డీఎస్పీ అత్యుత్సాహం వల్ల ఒక్కసారిగా భక్తులు రావడంతో తొక్కిసలాట జరిగిందని.. ఘటనపై డీఎస్పీ సరిగా స్పందించలేదని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. "ఎస్పీ వెంటనే సిబ్బందితో వచ్చి భక్తులకు సాయం చేశారు. అంబులెన్స్ వాహనాన్ని టికెట్ కౌంటర్ బయట పార్క్ చేసి డ్రైవర్ వెళ్లిపోయాడు. 20 నిమిషాల పాటు డ్రైవర్ అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే భక్తులు చనిపోయారు" అని నివేదికలో వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన జరిగిన తర్వాత డీఎస్పీ తీరుపై ఎస్పీ సుబ్బారాయుడుకు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. నిన్న వైకుంఠద్వార దర్శనం టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందారు. ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు.. డీజీపీ, టీటీడీ ఈవో, తిరుపతి కలెక్టర్, ఎస్పీలతో టెలీకాన్ఫరెన్స్ లో మాట్లాడారు. ఘటనకు కారణాలు, ప్రస్తుత పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు ఎందుకు చేయలేదని అధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.




## తిరుమల తొక్కిసలాట ఘటనపై మోదీ, రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి..

**తిరుపతి:** వైకుంఠ ఏకాదశి సర్వదర్శనం కోసం టోకెన్లు జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని మోడి అన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల సాయం అందిస్తోందని తెలిపారు. ఈ ప్రమాదంపై స్పందించిన రాహుల్ గాంధీ.. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు అనిత, నిమ్మల విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తొక్కిసలాటలో ఆరుగురు చనిపోవడం అత్యంత బాధాకరమని ఎపి హెూంమంత్రి అనిత అన్నారు. తిరుపతి ఎస్పీతో ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.








తెలంగాణ షాన్

## సంపాదకీయం

# జారుగుబల్లపై రూపాయి పతనం!

భారత బడా బూర్జువా వర్గం, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదంతో రాజీపడి దేశ సహజ వనరులను కట్టబెట్టటమే కాక, దేశ కరెన్సీ అయిన రూపాయి విలువను కూడా అమెరికా సామ్రాజ్యవాదుల దయకు వదిలి వేశా రు. దాని ఫలితమే రూపాయి విలువ పతనమై నేడు డాలర్‌కి 85.7 రూపాయిలుగా ఉంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి నిదర్శనం. అధికార మార్పిడి జరిగిన తర్వాత 1947లో ఒక డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.50 రూపాయల ఉంది. 1948 నుండి 1980 వరకు కొంచెం అటుఇటుగా ఉంది. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత రూపాయి విలువ పతనం ఎక్కువగా జరిగింది. అధికార మార్పిడి దగ్గర నుంచి 2022 వరకు రూపాయి విలువ 79 సార్లు పడిపోయింది. నేడు రూపాయి విలువ పతనం తారస్థాయికి చేరింది. సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంపై ఎక్కువగా ఆధారపడటం, నూతన ఆర్థిక విధానాల అమలు, ఎగుమతి, దిగుమతుల్లో ఉన్న వ్యత్యాసం, పెద్ద నోట్ల రద్దు, కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ –రష్యా యుద్ధం, తాజాగా ముడి చమురు ఉత్పత్తిని తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయం రూపాయి విలువ పతనానికి కారణంగా ఉంది. ప్రపంచ చమురు వినియోగించే దేశాల్లో 3వ స్థానంలో ఉన్న భారత్‌కు 85% చమురు దిగుమతిగా ఉంది. చమురే కాకుండా ఫార్మా, టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ తదితర రంగాలకు అవసరమైన ముడిసరుకులు, వంటనూనెలు, ఆహారధాన్యాలు, పప్పులు, లోహాలను భారతదేశం దిగుమతి చేసుకుంటున్నది. ఈ దిగుమతులకు చెల్లింపులు డాలర్లలోనే జరపాలి. రూపాయి విలువ తగ్గిన ప్రతిసారి దిగుమతుల కోసం చెల్లించాల్సిన మొత్తం పెరుగుతూ ఉంటుంది. రూపాయి విలువ పడిపోవటం వల్ల దిగుమతి అయ్యే అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. ధరల పెరుగుదల భారం ప్రజలపైనే పడుతుంది. డీజిల్ ధరలు పెరిగితే, రవాణా చార్జీలు పెరిగి ఉప్పు, పప్పు, ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి.

అంతేకాకుండా ప్రయాణ ఖర్చులు, ఆటోచార్జీలు, బట్టలు, పిల్లల స్కూలు ఫీజులు, ఫోన్లు, టివిలు, ల్యాప్ టాపుల, వాహనాల ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతుంది. రూపాయి పతనం ఫలితంగా బడ్జెట్ లెక్కలు, అంచనాలు మారిపోతాయి. విదేశాలకు ఎగుమతి చేసే వారికి మాత్రం ఆదాయం పెరుగుతుంది. ప్రపంచ దేశాలపై ఏ దేశ పెత్తనం ఉంటుందో, ఆ దేశ కరెన్సీ ఆధిపత్యం చలాయిస్తుంది. 1947 దాకా ప్రపంచ ఆధిపత్యం బ్రిటన్ చేతుల్లో ఉంది. దాని ఫౌండ్ కరెన్సీ, ఇతర దేశాల కరెన్సీపై ఆధిపత్యం చలాయించింది. బ్రిటన్ బలహీనపడిన తర్వాత అమెరికా ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తూ, తన డాలర్ కరెన్సీ ఆధిపత్యాన్ని ఇతర దేశాలపై నెలకొల్పింది. డాలర్ ఆధిపత్యం: చమురును డాలర్లలో చెల్లించాలనే ఒప్పందం కుదరటానికి ముందు అమెరికా కరెన్సీ విలువ ఆ దేశం వద్దనున్న బంగారం నిల్వలతో ముడిపడి ఉంది. 1974 లో సౌదీ అరేబియా తదితర దేశాలు చమురు ఉత్పత్తిని పరిమితం చేయటంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. దీంతో అమెరికా రంగంలోకి దిగింది. సౌదీ అరేబియా డాలర్లలోనే చమురు అమ్మకాలు జరపాలని, మిగులు ఆదాయాన్ని అమెరికా ప్రభుత్వ బాండ్లలో మదుపు చేయాలని, దానికి బదులుగా సైనిక, ఆర్థిక సహాయం అందిస్తామని ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా సౌదీ అరేబియాను తన వ్యూహంలో అమెరికా ఇరికించింది. అప్పటి నుండి చమురు ఉత్పత్తి దేశాల్లో డాలర్లలోనే చమురు విక్రయం కొనసాగింది. ముడి చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలరు ప్రాధాన్యత బాగా పెరిగింది. ముడి చమురుకు అన్ని దేశాలు డాలర్లలో చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రాచుర్యం పొందింది. అంతర్జాతీయ మార్కెట్లో వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే కొనసాగటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికాకు ఆధిపత్యం ఏర్పడింది. డాలర్ గిరాకీ వల్ల ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే దాని విలువ బాగా పెరిగింది. అందరికీ డాలర్లు అవసరం కాబట్టి, దానినే తన ఆయుధంగా వాడుకునేందుకు అమెరికాకు అవకాశం ఏర్పడింది. ఉక్రెయిన్‌తో యుద్ధం వలన రష్యా మీద ఆర్థిక ఆంక్షలు విధించటం డాలర్ ఆయుధీకరణకు నిదర్శనం. అమెరికాకు ఎదురు తిరిగే దేశాలకు డాలర్లు చిక్కకుండా చేస్తే వాటి ఎగుమతులు, దిగుమతులకు విఘాతం ఏర్పడుతుంది. పెట్టుబడులు ఆగిపోతాయి. డాలర్ మారకంలో ఆయా దేశాల కరెన్సీ విలువ పడిపోయి విదేశీ రుణాలపై అసలు, వడ్డీల చెల్లింపులు మోయలేని భారంగా మారుతుంది. ఆయా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లో భద్రపర్చటం జరుగుతుంది. అందువల్ల అమెరికా తనకు నచ్చిన దేశానికి కావాల్సినంతమేర డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు, నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంకు ఎకౌంట్లను స్తంభింపచేసి డాలర్ల కొరత సృష్టించవచ్చు. ప్రస్తుతం మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నాయి. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి ఉండేలా చేయటానికి కూడా డాలర్ పెత్తనం అమెరికాకు తోడ్పడుతుంది.

# ప్రమాణ స్వీకరణ మహోత్సవంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి






**కుత్బుల్లాపూర్ జనవరి 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వరా స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి మరియు డైరెక్టర్ గా శ్రీనివాస్ చారీ, రవీందర్, రాజు, వేణు గౌడ్ నియమితులైన సందర్భంగా శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మ రెడ్డి, క్రిష్ణ గౌడ్, రషీద్, మరియు యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# భర్త ఇంటిముందు న్యాయం కావాలంటూ మౌన పోరాటం చేస్తున్న భార్య




**కుత్బుల్లాపూర్ జనవరి 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్** కట్నం తీసుకొని పెళ్లి చేసుకున్నాడు.. ఆపై బిడ్డను కన్నాడు.. సన్నిహితంగా ఉంటేనే విడాకు నోటీసు ఇచ్చాడు..ఇదేంటని అమ్మాయి తల్లిదండ్రులు పెద్దమనుష్యుల సమక్షంలో ప్రశ్నిస్తే నిష్కారణంగా నాకు వద్దు అంటున్నాడు.. దీంతో ఆ అమ్మాయి భర్త ఇంటి ముందు న్యాయం కావాలంటూ కాలనీ వాసుల మద్దతుతో మౌన పోరాటం చేస్తున్న ఘటన కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సూరారం లక్ష్మీ నగర్ లో చోటు చేసుకుంది..




వివరాల్లోకి వెళ్తే శ్రీ రమ్య, శ్రీ తేజ లకు 23/02/2023 లో మైనం భాస్కర్ రావ్,విజయలక్ష్మి వాళ్ళ అబ్బాయి తో వివాహం జరిగింది.. 3 నెలల కాపురం సజావుగా జరిగింది.. గర్భవతి అయిన రమ్యను అభార్షన్ చేయించుకో అంటూ భర్త ఒత్తిడి తెచ్చాడు.. దీంతో ఆమె అంగీకరించక పోవడంతో భార్యపై కోపం పెంచుకున్నాడు.. ప్రసవం కోసం పుట్టింటి కి వెళ్ళిన భార్య తో ప్రేమ గా ఉంటూనే పథకం ప్రకారం విడాకులు అప్లై చేసాడు..ప్రసవం తర్వాత బాబు చూడడానికి రాలేదు సరికదా చల్లగా విడాకు నోటీసు చేతిలో పెట్టాడు..దీంతో రమ్య 9 నెలల కొడుకును తల్లిదండ్రులతో వచ్చి భర్త ఇంటికి రావడంతో అత్త మామ భర్త రమ్యను బయటకు తోసివేసి ఇంటికి తాళం వేసి వెళ్ళిపోయారు.. దీంతో రమ్య తన గోడును కాలనీ వాసులకు చెప్పి ఇంటి ముందు మౌన పోరాటానికి దిగింది.. నాకు నా కొడుకుకు న్యాయం కావాలంటూ కన్నీటి పర్యంతం తో మీడియా ను ఆశ్రయించింది. నేను చేసిన తప్పేంటి కన్న తల్లిదండ్రులు పెద్దమనుష్యుల సమక్షంలో బంగారం, కట్నం ఇచ్చి పెళ్లి చేసి మెట్టినిల్లుకు పంపిస్తే నన్న రోడ్డు పాలు చేసినారు. భర్త అత్తమామల నుంచి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

# యువత స్వయం శక్తితో ముందుకు సాగాలి

## - “జిల్లా ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్”




**జవహర్ నగర్ తెలంగాణ షాన్, జనవరి 09:** జవహర్ నగర్ ,యువత స్వయం శక్తితో ముందుకు సాగాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రష్ యాదవ్ తెలిపారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కెఎన్ఆర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కల్లేపల్లి సదానంద్ కుమారుడు భాను ట్రేడర్స్ పేరుతో నూతన హార్డ్వేర్ షాపును ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వజ్రేష్ యాదవ్ హాజరై మాట్లాడుతూ యువత స్వయం శక్తితో ముందుకు సాగాలని ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకొని తమ స్వంత కాళ్లపై నిలబడి వ్యాపారంలో ఎదగాలని తెలిపారు. ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాలకు పెద్దపీట వేస్తుందని తద్వారా యువత సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ స్కీములను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మేడ్చల్ జిల్లా వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కార్పొరేటర్ కుతాడి సాయి, సతీష్ గౌడ్, ప్రేమల శ్రీనివాస్, కృష్ణ గౌడ్, వెంకటేష్ గౌడ్, భాస్కర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, సాయికిరణ్, రాజు, కాగితపు రాజు, కనకయ్య రాజు, డిఎస్ఎస్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన రఫియా బేగం



**కుత్బుల్లాపూర్ జనవరి 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్** రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా షేక్ రఫియా బేగం నియమింపబడిన సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజ కవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యదా పూర్వకంగా కలిశారు అనంతరం హనుమంత్ రెడ్డి రెడ్డి శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, బిక్కన్ షా, పద్మ రావు పాల్గొన్నారు.

# వీరనారీమణుల ఆధ్వర్యంలో ఘనంగా ఫాతిమా షేక్ జయంతి



**ఖమ్మం జనవరి 9:** భారతదేశ తొలి ముస్లిం మహిళ ఉపాధ్యాయులు , ప్రముఖ సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ , జయంతి కార్యక్రమాన్ని గురువారం వీరా నాది మనుల వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో సమితి కార్యదర్శి స్పందన నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి , నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసిన అనంతరం సమితి అధ్యక్షురాలు ఉపేంద్ర బాయి , ప్రధాన కార్యదర్శి జ్యోతి , ఉపాధ్యక్షురాలు త్రివేణి , గౌరవ సలహాదారులు సుశీల బాయి , ముఖ్య అతిథులు రావుల వెంకటేశ్వర్లు , బత్తిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఫాతిమా షేక్ సేవలను కొనియాడారు 1831లో మహారాష్ట్ర పూనే లో జన్మించిన ఫాతిమా షేక్ ఆనాడు పూలే దంపతులతో కలిసి మహిళల విద్య కోసం కృషి చేశారని పేర్కొన్నారు. పూలే దంపతులకు తన దగ్గరే ఆశ్రయం కల్పించి , సంఘ సంస్కరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆమె ఆశలను ఆశయాలను కొనసాగించడమ నిజమైన నివాళి అని ఈ సందర్భంగా వక్తలు కొనియాడుతూ మహిళలు సావిత్రిబాయి పూలే తో పాటు ఫాతిమా షేక్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సమితి నాయకులు కవిత, ప్రమీల, భవాని, కృష్ణవేణి, సుజాత ,ఝాన్సీ, అనిత, సంధ్య, కల్పన, జాన్ బీ ,సుభద్ర ,అనురాధ, నాగేంద్ర, విజయ, పగిడిపల్లి నాగేశ్వరరావు, జావేద్ , రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేదెలా...100 కోట్లపైనే బెట్టింగ్స్



**ఏలూరు :** సంక్రాంతి పండుగకు మరో వారం ఉండగానే ఏపీలో పందెం కోళ్ల హంగామా నడుస్తోంది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో గుట్టు చప్పుడు కాకుండానే పందెం రాయుళ్లు కాలుదువ్వుతున్నారు. పెద్దగా హంగామా చేయకుండా రాత్రి వేళల్లో రహస్యంగా పందేలు నిర్వహిస్తున్నారు. చీకటి పడగానే 7 గంటలకు పందెం మొదలుపెట్టి లైట్ల వెలుతురులోనూ తెల్లారేలోపు కంప్లీట్ చేస్తున్నారు. ఉండి, భీమవరం ప్రాంతాల్లో ఒక్కో వారం ఒక్కో ప్రాంతంలో పందేలు వేస్తున్నారు. బరిలోకి దిగేవారికి సీక్రెట్ గా సమాచారం ఇచ్చి ఐడీ కార్డులను పంచుతున్నారు. అంతేకాదు ఇక వీరి పందేలను ఫొటో, వీడియో తీయకుండా ముందు జాగ్రత్తలు తీసకుంటున్నారు. ఇక ఒక్కో పందెం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల చొప్పున నడుస్తున్నాయట. కొన్నిసార్లు రూ.50 లక్షలకు వరకూ బెట్టింగులు పెడుతున్నారు. పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలోని తదితర మండలాల్లో కోళ్లను కొనుగోలు చేసి రంగంలోకి దిగుతున్నారట. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి భారీ సంఖ్యలో కోళ్లు గోదావరి జిల్లాకు తరలివెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే దాదాపు రూ.100 కోట్లు చేతులు మారినట్లు అంచనా వేస్తున్నారు. పందేలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు రేంజి డీఐజీ అశోక్‌కుమార్ సీరియస్ వార్నింగ్ ఇస్తున్నప్పటికీ బెట్టింగ్ రాయుళ్లు గుట్టు చప్పుడు కాకుండా కాసులు దండుకోవడం సంచలనం రేపుతోంది. ఎక్కెడక్కడ జరుగుతాయంటేసంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు కోడిపందాలు జోరున సాగుతుంటాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్లోని కోస్తా తీర ప్రాంతంలో కోడిపందాలు చాలా ప్రసిద్ధి చెందినవి. కోడిపందాలు అనేవి ఇక్కడ సాంప్రదాయంలో ఒక భాగం. ఏపీలో సంక్రాంతి కోడిపందాలు ఏ ఏ ఊళ్ళల్లో పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ లో పెద్ద ఎత్తున కోడిపందాలు నిర్వహించే పట్టణాల్లో భీమవరం ఒకటి భీమవరం చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున కోడిపందాలు నిర్వహిస్తారు. ఇక్కడ కోడిపందాలను చూసేందుకు దేశ విదేశాల నుంచి ఔత్సాహికులు వస్తారు. ఇక్కడ కోడిపందాల సమయంలో వందల కోట్లు చేతులు మారుతుందని స్థానికులు చెబుతుంటారు. తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురంలో పెద్ద ఎత్తున కోడిపందాలు నిర్వహిస్తారు.

# కేసీఆర్ మౌనం ఎన్నాళ్లు...



**హైదరాబాద్ :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు జనంలోకి ఎప్పుడు వస్తారు? 2023వ సంవత్సరం నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఓడిపోయిన తర్వాత నుంచి ఆయన తన గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లోనే ఉంటున్నారు. సంవత్సరం గడిచిపోయినా ఇప్పటివరకు ఆయన శాసనసభలోకి అడుగుపెట్టలేదు. శాసనసభ్యుడిగా శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. చిన్న ప్రమాదం కారణంగా కొద్ది మాసాలపాటు విశ్రాంతిలో ఉన్నప్పటికీ ఆయన ఫామ్ హౌస్ నుంచే రాజకీయాలు చేస్తూ ఉన్నారు. కొద్ది రోజులు ఓటమి భారం, ఆ తర్వాత ప్రమాదంలో గాయపడి విశ్రాంతి, ఆ వెనువెంటనే కూతురు కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కొన్ని మాసాలపాటు జైలుకు వెళ్లడం.. వీటితోటే మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుకి సంవత్సర కాలం గడిచిపోయింది.ఆయన ఆరోగ్యం బాగుపడింది. కవిత జైలు నుంచి వచ్చారు. అయినా ఆయన ఇంకా బయటికి రావడంలేదు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్దలు ఎన్నిసార్లు ఎన్ని విధాలుగా కవ్వించినా ఆయననుండి ఎటువంటి స్పందనా లేదు. 'కెసిఆర్ సభకు వస్తే ఏ విషయం మీదనైనా చర్చకు మేము సిద్ధం, ఎన్నిరోజులైనా శాసనసభ సమావేశాలు నిర్వహించడానికి వెనుకాడం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సవాల్ చేశారు. అయినా కెసిఆర్ నుంచి ఎటువంటి స్పందనా లేదు. నిన్ననే పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా ఒక మాట అన్నారు. శాసనసభకు రాని వ్యక్తికి ప్రతిపక్ష నాయకుడి హోదా ఎందుకు? అని. ఇంతకూ కెసిఆర్ ఎప్పుడు బయటికి వస్తారు? ఇప్పుడు దీనిమీదనే చర్చ జరుగుతోంది రాజకీయ వర్గాల్లో. ఆయన బయటికి రాకపోవడం గురించి భారత రాష్ట్ర సమితి కార్యాధ్యక్షుడు, మాజీ మంత్రి కెటి రామారావు పత్రికల వారితో మాట్లాడుతూ 'ఓడిపోతే రెస్ట్ తీసుకుంటానన్న కెసిఆర్ అదే పని చేస్తున్నారు ఇప్పుడు. సరైన సమయంలో ఆయన బయటకు వస్తార'ని చెప్పారు. ఆ సరైన సమయం ఎప్పుడు వస్తుందా అని భారత రాష్ట్ర సమితి రెండవ శ్రేణి నాయకులు, కార్యకర్తలు, కెసిఆర్ అభిమానులకంటే ఎక్కువగా ప్రత్యర్థి రాజకీయ వర్గాలే ఎదురు చూస్తున్నట్లుగా ఉంది. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో జరిగే పార్టీ సభల గురించి కెటి రామారావు ఇటీవల ప్రస్తావించారు. ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావ సభను వరంగల్‌లో ఘనంగా నిర్వహించనున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో కెసిఆర్ పునరాగమనం గురించిన ఊహాగానాలు పెద్ద ఎత్తున చెలరేగుతున్నాయి. కెసిఆర్ బయటకు రావడమా, రాకపోవడమా, వస్తే ఎప్పుడు రావడం, ఏ విధంగా రావడం, ఆయన రాజకీయ వ్యూహాలు ఏమిటి అనేది పూర్తిగా ఆ పార్టీకి సంబంధించిన వ్యవహారమే అయినా దాని మీద చర్చ జరగడాన్ని ఎవరూ ఆపలేరు కదా. 1970లలో సిద్దిపేటలో యువజన కాంగ్రెస్ నాయకుడిగా జీవితం ప్రారంభించి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోకి దూకి 2014 లో రాష్ట్రాన్ని సాధించుకునే వరకు ఆయన రాజకీయాల్లో చురుకైన పాత్ర నిర్వహించడం కూడా కెసిఆర్ సంవత్సర కాలంగా రాజకీయాలకు ఎందుకు దూరంగా ఉన్నారని చర్చించుకునేందుకు ఆ స్కారం కల్పించింది. ఇంతకూ కెసిఆర్ సంవత్సరకాలంగా బయటకు రాకపోవడానికి కారణం ఏమిటి? ముఖ్యమంత్రిగా ఉంటే తప్ప శాసనసభకు వెళ్లరా? సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కెసిఆర్ ఇలా ఎలా ఆలోచిస్తారు?.ప్రజా తీర్పును మన్నించి ప్రతిపక్షంలోకి వచ్చినవాళ్లు మళ్లీ ఐదు సంవత్సరాలు కష్టపడి ప్రజల మన్నన పొంది తిరిగి అధికారంలోకి రావడానికి పని చేస్తారు. ఇలా అధికారం కోల్పోయిన సీనియర్ రాజకీయ నాయకులు అనేక మంది ప్రతిపక్షంలో ఉండి పని చేయడం, నిర్మాణాత్మక సలహాలు ఇవ్వడం, ప్రభుత్వం సరిగ్గా నడుస్తున్నదీ లేనిదీ గమనించడం, తప్పులు జరిగితే నిలదీయడం, పోరాటాలు చెయ్య డం అనేది అనేక సందర్భాల్లో జరుగుతూ వచ్చేదే. వయసులో తనకంటే చిన్నవాడు ముఖ్యమంత్రి అయ్యారనో, తనకు గిట్టనివాడు ముఖ్యమంత్రి అయ్యారనో శాసనసభ ముఖం చూడని నాయకులు చాలా తక్కువ మంది ఉంటారు. 1980 ద శకంలో ఈశాన్య రాష్ట్రమైన అసోంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఆల్ అ స్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు)కు నాయకత్వం వహించిన యువకుడు ప్రఫుల్ల కుమార్ మహంత ఆ వెంటనే జరిగిన ఎన్నికల్లో గెలిచి అస్సామ్ గణపరిషత్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి అయినప్పుడు, అంతకుముం దు ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హితేశ్వర సైకియా ప్రతిపక్షంలో కూర్చున్నారు. తర్వాత మళ్ళీ ప్రఫుల్లని ఓడించి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు మరోసారి. తొలిసారి ముఖ్యమంత్రి అయ్యేనాటికి ప్రఫుల్ల కుమార్ మహంతకు రాజకీయాలతో అసలు సంబంధమే లేదు. విశ్వవిద్యాల యం నుంచి నేరుగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించాడు. హితేశ్వర్ సైకియా కంటే వయసులో కూడా ప్రఫుల్ల చాలా చిన్నవాడు. మరి ఆనాడు హితేశ్వర్ సైకియా తనకంటే ఇంత చిన్నవాడు తనను ఓడించి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పి శాసనసభకు పోకుండా ఉన్నాడా? ఇలాంటి ఉదాహరణలు మనకు అనేకం కనిపిస్తాయి. ఇవేవీ చంద్రశేఖరరావు గారిని శాసనసభకు తీసుకువచ్చేందుకు ఉ పయోగపడలేదు.ప్రస్తుత శాసనసభలో తన స్థాయి నాయకులెవరూ లేరు కాబట్టి రాకూడదు అనుకుంటున్నారేమో తెలియదు. ఆయన అలా అనుకుంటూ ఉంటే మాత్రం పొరపాటు చేస్తున్నారు. భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెందిన తెలంగాణ రాష్ట్ర సమితిలో ఇతర నాయకులు ఎంతమంది ఉన్నా ప్రత్యక్ష రాజకీయాల్లో ఆయన లేకుండా పోవడంవల్ల జరిగే నష్టాన్ని నివారించలేరు. భారత రాష్ట్ర సమితి మళ్లీ అధికారంలోకి వస్తుందా రాదా అనే విషయం పక్కనపెడితే చంద్రశేఖరరావు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండటంవల్ల అసలుకే మోసం వస్తుందేమో!ఏప్రిల్ 27న వరంగల్‌లో జరుగుతుందని చెప్తున్న పార్టీ ఆవిర్భావ సభలో కెసిఆర్ ఎటువంటి నిర్ణయాన్ని ప్రకటించబోతున్నారనే విషయం మీద చర్చ జరుగుతున్నది.

# ఎకరానికి 30 నుంచి 50 లక్షలు



**హైదరాబాద్ :** తెలంగాణలో గేమ్ ఛేంజర్ అవుతుందని భావిస్తోన్న రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలోనే.. మొదటగా నిర్మించదలచిన రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియలోనూ స్పీడు పెంచారు అధికారులు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో యాదాద్రి జిల్లా అధికారులు.. భూములు కోల్పోతున్న రైతులతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే తుర్కపల్లి పరిధిలో రెండు గ్రామాల రైతులతో మాట్లాడారు. మెరుగైన పరిహారం ఇస్తే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆ రెండు గ్రామాల రైతులు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఇక.. మిగిలిన గ్రామాల రైతులతోనూ అధికారులు చర్చలు జరపనున్నారు.అయితే.. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగంలో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి మొత్తం 164 కిలో మీటర్లు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాగా.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 5 మండలాల్లోని 24 గ్రామాల్లో 59 కిలో మీటర్ల నిర్మాణానికి 1800 ఎకరాలకు పైగా భూమి సేకరించాల్సి ఉండగా.. కొన్ని ప్రాంతాల్లోని రైతులు భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు.ఉన్న రైతులకు మంచి పరిహారం ఇచ్చి ఒప్పించి మెప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. అధికారులు గ్రామాల బాట పట్టారు. రైతులను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్హనుమంత రావు క్షేత్రస్థాయికి వెళ్లి బాధిత రైతులతో నేరుగా మాట్లాడుతున్నారు. ముందుగా తుర్కపల్లి మండలంలోనే రీజినల్ రింగ్ రోడ్డు ప్రారంభమవుతుండగా అక్కడి రైతులతో చర్చించారు.భువనగిరి మండలంలో196 ఎకరాలను సేకరించాల్సి ఉండగా.. రాయగిరి గ్రామంలోని 105 ఎకరాలకు చెందిన రైతులు భూమి ఇచ్చేందుకు వ్యతిరేకిస్తున్నారు. సర్వే నంబర్ 215తో పాటు పలు సర్వే నంబర్లలో ఎకరానికి రూ.13.12 లక్షలు, సర్వే నంబర్ 379తో పాటు మిగతా నంబర్లలో రూ.29.40 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. మరింత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో.. సర్వే నంబర్ 682 తో పాటు పలు నంబర్లలో రూ.36.75 లక్షల వరకు రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ఉండగా.. బహిరంగ మార్కెట్ ఎకరానికి కోట్లలో పలుకుతోంది. అయితే.. రిజిస్ట్రేషన్వ్యాల్యూను బట్టి రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షలకు పైగా గ్రామానికి చెందిన రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్తుండగా.. ఆమేరకు ప్రపోజల్స్ రెడీ చేస్తున్నట్టు పేర్కొన్నారు.మరోవైపు.. తుర్కపల్లి మండలం కోనాపురం, ఇబ్రహీంపూర్లో 38 ఎకరాలకు చెందిన రైతులను కలెక్టర్తో పాటు అడిషనల్ కలెక్టర్ కలిసి మాట్లాడారు. బహిరంగ మార్కెట్లో ఎకరానికి కోటి రూపాయల డిమాండ్ ఉందని.. తమకు కనీసం రూ.50 లక్షలైనా ఇవ్వాలని రైతులు కోరారు. అయితే.. నేషనల్ హైవే రూల్స్ ప్రకారం ఇక్కడ రిజిస్ట్రేషన్వ్యాల్యూకు మూడు రెట్లు మాత్రమే పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని.. ఇలా చూస్తే ఎకరానికి రూ.19 లక్షలే వస్తుందని అధికారులు వివరించారు. అయినప్పటికీ.. ఎకరానికి రూ.30 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికారులు చెప్పిన మాటలకు.. రైతులు సానుకూలత వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. మిగిలిన 22 గ్రామాల రైతులతోనూ మాట్లాడి.. అందరిని ఒప్పిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

# మానుకోటలో గులాబీ దిక్కెవరు

**వరంగల్ :** పదేళ్లు చెలాయించిన నేతలు ఓడిపోయిన తర్వాత ఇప్పుడు పార్టీ ఆఫీసు గుమ్మం కూడా తొక్కడం లేదంట. దాంతో అక్కడ బీఆర్ఎస్ ఆఫీసు కూడా మూతపడిందంట. కారు పార్టీకి అంత దారుణమైన పరిస్థితి ఎక్కడ దాపురించింది?నియోజకవర్గ బాస్‌లు ఎమ్మెల్యేలే.. వారు చెప్పిందే ఫైనల్.. వారు సై అంటే సై, నై అంటే నై.. ఇలా గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫుల్ పవర్స్ ఇచ్చాడు. ఇంకేముంది వారి ఆగడాలు నియోజకవర్గంలో మితిమీరి పోయాయి. సొంత పార్టీ నేతలను సైతం పట్టించుకోలేదు. ఇలా మాజీ ఎమ్మెల్యేలు అందినకాడికి దోచుకున్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్ నియోజకవర్గంలో సైతం అప్పటి ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అవినీతి కి అడ్డు అదుపు లేకుండా పోయింది. పార్టీని పక్కన పెట్టి తన సొంతవారి కోసం చేయాల్సిదంతా చేసుకున్నారు. ముందు నుంచి గులాబీ జెండా పట్టిన వారికి మొండి చేయి చూపించారు.తహశీల్దార్ మొదలుకొని కలెక్టర్ వరకు, ఎస్సై నుండి ఎస్పీ వరకు బెదిరింపులు పాల్పడినట్లు శంకర్‌నాయక్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఆయన చెప్పిన పని చేయకుంటే గులాబీ బాస్ కేసీఆర్ కి చెప్పి ట్రాన్స్‌ఫర్ చేయించి, ఎక్కడా కూడా పోస్టింగ్ లేకుండా చేయిస్తానని వార్నింగ్ ఇచ్చే వారంట. ఓ ప్రభుత్వ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రీతిమీనా తో దురుసుగా వ్యవహరించారు. దాంతో ఆమె జిల్లా ఎస్పీ కి, ఎయిా సంఘానికి ఫిర్యాదు చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని శంకర్ నాయక్ ఏకంగా జిల్లా కలెక్టర్ ను బదిలీ చేయించారు. అప్పట్లో ఆమెకు ప్రాధాన్యత లేని పోస్టింగ్ ఇచ్చారు. అలా శంకర్ నాయక్ చెలరేగి పోవడానికి కేసిఆర్, కేటీఆర్‌ల అండదండటే కారణమంటారు.అదలా ఉంటే బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మకాం మార్చారు. తన సొంత గ్రామం అయిన పాలకుర్తి నియోజకవర్గంలోని ఊకల్ గ్రామం కు పరిమితం అయ్యారు. దాంతో మహబూబాబాద్ బీఆర్ఎస్ శ్రేణులు బాగోగులు ఎవరికి చెప్పుకోవాలి అని తలలు పట్టికున్నాయి. నియోజకవర్గంలో ఉన్న ఇంటికి తాళం వేసి ఉండడంతో నిరాశ తో వెనుతిరిగుతున్నారు. ఇక జిల్లా పార్టీ అధ్యక్షురాలు గా ఉన్న మాజీ ఎంపీ కవిత కూడా హైదరాబాద్ లో ఉంటున్నారు. ఈమె సైతం కేటిఆర్ కు బినామీ ఉంటూ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎంపీగా ఉన్నప్పుడు పార్టీ శ్రేణులను పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి.కవిత ఇంటికి కూడా తాళం వేసి ఉంటుంది. ఎప్పుడో ఓ సారి అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారంట. ఇక ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ , జిల్లా నుండి స్త్రీ ,శిశు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గా ప్రాతినిధ్యం వహించారు. ఈమె కూడా వ్యక్తిగతంగా వందల కోట్ల ఆస్తులు కూడా




బెట్టారని జిల్లాలో టాక్. ఒక్క గిరిజనుడిని కూడా ఎదగనివ్వలేదన్న విమర్శులున్నాయి. ఆమె కూడా జిల్లా లో అందుబాటులో ఉండటం లేదు. ఆమె ఇంటికి కూడా తాళమే స్వాగతం పలుకుతుంది. ఇక జిల్లా కేంద్రంలో లో మిగిలింది ఎమ్మెల్సీ తక్కళ్ల పల్లి రవీందర్ రావు.. ఈయన రూటే సెపరేటు. పార్టీ క్యాడర్ కానీ, పార్టీ పనులు కానీ పట్టించుకోరు. నిత్యం కేసీఆర్ భజన చేయడమే ఆయన పని. ఆయన కేవలం తన వర్గం కోసమే పనిచేస్తారంట.అప్పుడు అధికారం లో ఉన్నప్పుడు పార్టీ తో రాజభోగాలు అనుభవించి, వ్యక్తి గతంగా ఎంతో లాభపడి ప్రస్తుతం ఎవరూ నియోజకవర్గంలో అందుబాటులో లేకపోవడంతో క్యాడర్ మొత్తం గుర్రు గా ఉన్నారు. జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ , మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత వేర్వేరు గా క్యాంపు కార్యాలయాలను పోటాపోటీగా ఏర్పాటు చేసుకున్నారు. ఇక అప్పటి బీఆర్ ఎస్ ప్రభుత్వం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని నిర్మించింది. ఇప్పుడు అవన్నీ మూతపడ్డాయి. అధికారం పోయాక జనాలు మాకు ఎందుకు అనుకున్నారో ఏమో అటు జనానికి, ఇటు కేడర్‌కి ఎవరూ అందుబాటులో లేకుండా పోయారు.మొత్తానికి మానుకోటలో బీఆర్ఎస్ నేతల క్యాంపు కార్యాలయాలకు , బీఆర్ఎస్ కార్యాలయానికి తాళం పడటం చర్చనీయాంశంగా మారింది. అందుబాటులో ఉంటే పార్టీ క్యాడర్ కు బాధలు,కష్టలలో పాలు పంచుకోవాల్సి వస్తుందని, ఆర్థిక భారం మీద పడుతుందని కూడా జిల్లా కార్యాలయంతో పాటు అందరి క్యాంపు కార్యాలయం కు తాళం వేసుకున్నట్లు ప్రజల్లో టాక్ వినిపిస్తుంది. గత ఏడాది మొత్తం లో కేవలం 5 సార్లు మాత్రమే పార్టీ కార్యాలయం తాళం తీశారని, తీసినప్పుడల్లా గంట సమయం కు మించి ఉంచలేదని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. దీన్ని బట్టి చూస్తే బీఆర్ ఎస్ శ్రేణుల్లో వారి పట్ల , పార్టీ పట్ల ఎంత వ్యతిరేకత ఉందో అర్థం అవుతుంది.

# 20 నాటికి భరోసా లబ్దిదారుల జాబితా

**నల్గొండ :** తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా నిధులను ఈ నెల 26వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. అయితే ఇప్పటికే దీనికి సంబంధించిన విధివిధానాలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. పూర్తిగా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా నిధులు వర్తిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు కాకుండా, రియల్ ఎస్టేట్ వెంచర్లకు ఉపయోగించిన భూమిని మినహాయించి మిగిలిన అన్ని భూములకు ఈ రైతు భరోసాను అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి రైతు ఖాతాలో పన్నెండు వేల రూపాయలు దీంతో పాటు వ్యవసాయ కూలీలకు కూడా పన్నెండు వేల రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటన చేసిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ వ్యవసాయ యోగ్యమైన భూముల వివరాలను సేకరిస్తున్నారు. అలాగే లబ్దిదారుల వివరాలను కూడా నోట్ చేసుకుంటున్నారు. కానీ పంట భూముల్లో వేయకపోయినా ఆ భూమి వ్యవసాయ యోగ్యమైనదిగా ఉంటే చాలు దానికి రైతు భరోసా నిధులు ఇవ్వాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. పంట ఎప్పుడు వేశారన్నది కాకుండా.. ఎప్పుడైనా పంట వేసుకునే అవకాశం ఉన్న భూములన్నింటికీ రైతు భరోసా నిధులను ఆ యా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జనవరి 26వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో విడతల వారీగా ఈ నిధులను జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అరవై లక్షల మంది వరకూ... ఈ పథకం కింద దాదాపు అరవై లక్షల మంది రైతుల వరకూ లబ్ది పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ప్రభుత్వం ఇప్పటికే కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీ నాటికి లబ్దిదారుల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించింది. తొలి విడతగా ఎకరానికి ఆరు వేల రూపాయలు చెల్లించనున్నారు. అలాగే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కూలీలలకు కూడా రెండు విడతలుగా నగదు చెల్లించాలని నిర్ణయించారు. ఇందుకోసంఇప్పటికే నిధులను కూడా సిద్ధం చేశారు. ఒక్క వ్యవసాయ కూలీలకు ఇచ్చే ఆత్మీయ భరోసాకు 700 కోట్ల రూపాయలు అవసరమవుతాయని అంచనా వేసి ఈ మేరకు నిధులను సిద్ధం చేసి పెట్టింది. రైతు భరోసాకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలను అధికారికంగా ప్రభుత్వం విడుదల చేయనుంది.

# కేసుల నుంచి బయిట పడేదెలా..



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై వరసగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఆయన పదేళ్ల కాలంలో ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారని అందరికీ తెలిసిందే. పేరుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అయినా ఎక్కువగా నిర్ణయాలు కేటీఆర్ తీసుకునే వారు అని అందరూ ఒప్పుకునే విషయమే. కేసీఆర్ ప్రగతి భవన్ బయటకు రారు. సచివాలయానికి కూడా ఆయన రాక అరుదుగా ఉండేది. అందుకే కేటీఆర్ పైనే ఎక్కువ మంది ఆధారపడే వారు. ఆయన చెప్పినట్లుగానే అధికారులు సయితం నిర్ణయం తీసుకునేవారు. ఇది అందరికీ తెలిసిందే. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సయితం కేటీఆర్ ఆదేశాల ప్రకారం నడుచుకునే వారు. ఆయన తీసుకునే నిర్ణయమే ఫైనల్ అయ్యేది. ఒకరకంగా చెప్పాలంటే కేటీఆర్ షాడో సీఎంగా చెలాయించారన్నది అందరికీ తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయనపై వరసగా కేసులు నమోదవుతున్నాయి. ఫార్ములా ఈ రేసు కేసులో కూడా క్విడ్ ప్రోకో జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తుంది. ఏసీబీ ఈ మేరకు కేసు నమోదు చేసింది. రేపు విచారణకు వెళ్లాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్మూలా ఈ కారు రేసు వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా ఈఎఫ్ఓకు నిధులు బదలాయింపు.. అగ్రిమెంట్‌కు ముందే నిధులు చెల్లింపు వల్ల ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఏసీబీ ఆరోపిస్తుంది. అదే సమయంలో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా విచారణ చేస్తున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు అక్రమాణలపై అవినీతి జరిగిందని బీసీ నేత యుగంధర్ గౌడ్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఓఆర్ ఆర్ టెండర్లలో 7,380 కోట్ల మేరకు అవినీతి జరిగిందంటూ అందిన ఫిర్యాదు కూడా కేటీఆర్ మెడకు చుట్టుకునే అవకాశాలు లేకపోలేదు. అయితే ఇప్పటివరకూ ఏసీబీకి ఫిర్యాదు మాత్రమే అందింది. కేసు ఇంకా నమోదు చేయలేదు. ఇంత పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగం జరిగాయన్న ఫిర్యాదు అందడంతో ఖచ్చితంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో కేటీఆర్ పై వరస కేసులు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో దీంతో పాటు మరికొందరు కూడా కేటీఆర్ పై ఫిర్యాదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓఆర్ఆర్ లో జరిగిన అవినీతిపై ఈడీకి కూడా ఫిర్యాదు చేశారు.

# ఢిల్లీలోని సీఎం బంగ్లాపై రాజకీయం



**న్యూఢిల్లీ :** ప్రస్తుతం ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం దగ్గర హైడ్రామా కొనసాగుతోంది. 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పుడు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉంది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం కొనసాగుతోంది. ఢిల్లీ ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ సీఎం అధికారిక బంగ్లాను విలాసవంతంగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నారని బీజేపీ ఆరోపణలకు గుప్పిస్తుంది. ఈ సందర్భంలో ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మీడియా ప్రతినిధులతో కలిసి బంగ్లా వద్దకు చేరుకుని, 'మేము నిజం చూపిస్తాం' అని అన్నారు. అయితే, శాంతిభద్రతల సమస్యల కారణంగా పోలీసులు వారిని ఆపారు. పోలీసులు తమను ఎందుకు ఆపుతున్నారని అడుగుతూ ఆప్ నాయకులు ఆందోళనకు దిగారు. ఢిల్లీ సీఎం బంగ్లాలో బంగారు టాయిలెట్, స్విమ్మింగ్ పూల్, మినీబార్ ఉన్నాయని బిజెపి ఆరోపిస్తుంది. అంతకుముందు మంగళవారం ఢిల్లీ సీఎం అతీషి తనకు సీఎం బంగ్లాను లాక్కున్నారని ఆరోపించారు. అయితే ముఖ్యమంత్రులకు బంగ్లాలు ఎలా కేటాయిస్తారో తెలుసా?ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ బుధవారం ఉదయం సీఎం నివాసానికి చేరుకున్నారు. పోలీసులు వారిని ఎక్కడ అడ్డుకున్నారు. సాక్షాత్తూ సీఎం నివాసాన్ని శీష్ మహల్ అని, సీఎం నివాసంలో బంగారంతో తయారు చేసిన టాయిలెట్, బార్, స్విమ్మింగ్ పూల్ ఉన్నాయని ఆరోపణలను బట్టబయలు చేసేందుకు ఆప్ పార్టీ నేతలు సీఎం సభకు వెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ సీఎం నివాసం ఎదుట నిరసనకు దిగారు. రెండోసారి కూడా తనకు సీఎం నివాసం ఇవ్వలేదని, తనను నివాసం నుంచి గెంటేశారని గతంలో సీఎం అతిషి పేర్కొన్నారురాజధాని ఢిల్లీలో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పిడబ్ల్యుడి) ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో సహా మంత్రులందరికీ బంగ్లాలను కేటాయిస్తుంది. అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా తర్వాత అతిషి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పిడబ్ల్యుడి) వారికి సివిల్ లైన్స్, 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ముఖ్యమంత్రి నివాసాన్ని కేటాయించింది. అయితే ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి నివాసం ఆమ్ ఆద్మీ పార్టీ, భారతీయ జనతా పార్టీల మధ్య రాజకీయ సమస్యగా మారింది. దీనికి సంబంధించి రెండు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. సీఎం అతిశికి రెండుసార్లు సీఎం నివాసం కేటాయించినా తీసుకోలేదని బీజేపీ ఆరోపించింది.అన్ని రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి, మంత్రుల నివాసాల కేటాయింపు కోసం శాఖలు ఉన్నాయి. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో. ఇది రాష్ట్ర రెవెన్యూ శాఖ బాధ్యత. ముఖ్యమంత్రి, మంత్రుల నివాసాలను కేటాయించేది రాష్ట్ర రెవెన్యూ శాఖ

# సినిమాస్కోప్

## బాలయ్యకి జై లవకుశ చాలా ఇష్టం!



ఇటీవలే స్ట్రీమింగ్ మొదలుపెట్టిన అన్ స్టాపబుల్ 4 డాకు మహారాజ్ ఎపిసోడ్ లో బాలయ్య దర్శకుడు బాబీతో జరిపిన సంభాషణలో జూనియర్ ఎన్టీఆర్, జై లవకుశ ప్రస్తావన ఉద్దేశపూర్వకంగా తేలేదనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా జరిగింది. అసలు తారక్ పేరు, ఫోటో కానీ ఉండకూడదని ముందే నిర్వాహకులు అతిథులకు చెప్పినట్టుగా వచ్చిన వార్తలు బలంగా తిరిగాయి. కొందరు ఒక అడుగు ముందుకేసి ఏకంగా ఎడిటింగ్ లో ఆ ఫుటేజ్ తీసేశారని పబ్లిసిటీ చేయడంతో రకరకాలుగా దీని గురించి మాట్లాడుతున్నారు. ఫైనల్ గా మొన్న నిర్మాత నాగవంశీ, ఇవాళ బాబీ ప్రెస్ మీట్ సాక్షిగా క్లారిటీ ఇచ్చారు. డాకు మహారాజ్ మీడియా మీట్ లో బాబీ ఒక ప్రశ్నకు సమాధానంగా మాట్లాడుతూ మీరు అనుకున్నంత డ్రామా అక్కడ జరగలేదని, స్లయిడ్స్ లో చూపించిన ఫోటోల గురించి మాట్లాడుకున్నాం తప్పించి ఇంకే ఇతర ఉద్దేశం లేదని చెప్పారు. బ్రేక్ టైంలో నాగవంశీ, బాలకృష్ణ మాట్లాడుకున్నప్పుడు తారక్ టాపిక్ వచ్చిందని, అయితే ఆన్ రికార్డు ఉండవు కాబట్టి మీకు ఆధారం చూపించలేమని అన్నారు.

అంతే కాదు బాలకృష్ణకు జై లవకుశ చాలా ఇష్టమని, పలు సందర్భాల్లో తనతో వ్యక్తిగతంగా అన్నారని వివరణ ఇచ్చారు. ఇక్కడిదాకా మబ్బులు తొలగినట్టేనని బాలయ్య అభిమానులు సంతోషపడుతున్నారు. బాబీ దర్శకత్వం వహించిన సినిమాల పిక్స్ అన్నీ చూపించి ఒక జై లవకుశనే మర్చిపోవడం వల్ల ఇంత తంటా వచ్చింది. కొందరు తారక్ ఫ్యాన్స్ ఏకంగా డాకు మహారాజ్ ని చూడమని ఎక్స్ లో శపధాలు చేయడం దీని వల్ల కలిగిన పరిణామమే.

## మనకి గేమ్ ఛేంజర్ ఉంది తాతయ్య దిల్ రాజుకి మనవడి కాల్



ఒకప్పుడు టాలీవుడ్ మోస్ట్ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్లలో ఒకడిగా ఉండేవాడు దిల్ రాజు. ప్రతి సినిమాతో హిట్టు కొట్టడం ఎవరికీ సాధ్యం కాదు కానీ.. రాజు ఉన్నంతలో మంచి సక్సెస్ రేట్‌తో సాగిపోయేవాడు. ఒక సినిమా తేడా కొట్టినా ఇంకో చిత్రంతో హిట్టు కొట్టేవాడు. ఆయన ప్రొడ్యూస్ చేసిన సినిమా అయినా, డిస్ట్రిబ్యూట్ చేసిన చిత్రమైనా ప్రేక్షకులకు ఒక గురి ఉండేది. అందుకే టాలీవుడ్లో రాజును జడ్జిమెంట్ కింగ్ అని పిలిచేవారు. కానీ గత కొన్నేళ్లలో ఆయన ఇమేజ్ డ్యామేజ్ అయింది. రౌడీ బాయ్స్, ఎఫ్-3, థాంక్యూ, వారిసు, శాకుంతలం, ఫ్యామిలీ స్టార్.. ఇలా వరుసగా ఆయన్నుంచి నిరాశాజనకమైన చిత్రాలు వచ్చాయి. ముఖ్యంగా థాంక్యూ, శాకుంతలం, ఫ్యామిలీ స్టార్.. దిల్ రాజు జడ్జిమెంట్‌ను ప్రశ్నార్థకం చేశాయి.

వీటిలో 'ఫ్యామిలీ స్టార్' సినిమా ఫలితం తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టినట్లు, అంతర్మథనంలోకి నెట్టినట్లు దిల్ రాజు తెలిపాడు. "ఫ్యామిలీ స్టార్ రిజల్ట్ చూసి చాలా డిజప్పాయింట్ అయ్యాను. అప్పుడు ఏడేళ్ల నా మనవడు ఫోన్ చేసి డిజప్పాయింట్ అవ్వకు, నీ చేతిలో గేమ్ చేంజర్ ఉంది, దాంతో కొడతావ్ అన్నాడు. అది నాకు చాలా ఎమోషనల్‌గా అనిపించింది. అప్పుడే నేను ఒక ఛేంజ్ తీసుకున్నాను. ఎలా ఇన్‌స్పైర్ కావాలి, ఎక్కడ పట్టుకోవాలని అనే ఆలోచన మొదలైంది. సన్నిహితులు, శ్రేయోభిలాషులతో మాట్లాడే క్రమంలో అనుకున్న విధంగా సినిమాలు తీయలేకపోతున్నామయని అన్నారు. నాలో భయం మొదలైంది. స్టోరీ జడ్జ్‌మెంట్ పోయిందా? మళ్లీ కాంబినేషన్‌లకే వెళ్లాలా? అని ఆలోచించటం మొదలు పెట్టాను. శిరీష్ అయితే ఓవర్ లోడ్ కారణంగా సరిగా దృష్టిపెట్టలేకపోతున్నానని అన్నాడు. వీటిలో 'ఫ్యామిలీ స్టార్' సినిమా ఫలితం తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టినట్లు, అంతర్మథనంలోకి నెట్టినట్లు దిల్ రాజు తెలిపాడు. "ఫ్యామిలీ స్టార్ రిజల్ట్ చూసి చాలా డిజప్పాయింట్ అయ్యాను.

# వింటేజ్ వెంకీని తెలివిగా వాడుకున్నారు!



జనవరి 14 విడుదల కాబోతున్న సంక్రాంతికి వస్తున్నాం ప్రమోషన్లకి సంబంధించిన ఏ చిన్న అంశాన్ని వదలకుండా పబ్లిసిటీ విషయంలో దర్శకుడు అనిల్ రావిపూడి తీసుకుంటున్న జాగ్రత్తలు హైప్ ని పై స్థాయికి తీసుకెళ్తున్నాయి. బడ్జెట్, స్కేల్ పరంగా పండగ సినిమాల్లో చివరిగా ఉన్నది కాస్తా ఇప్పుడు గట్టి పోటీ అనుకునే దాకా వచ్చింది. థియేటర్లు తక్కువగా ఉన్న కొన్ని సి సెంటర్లలో ఇది కూడా కావాలని బయ్యర్లు డిమాండ్ చేస్తున్నారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నిన్న ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరిలతో కలిసి స్టేజి మీద వెంకీ మామ వేసిన స్టెప్పులు హోరెత్తిపోయాయి. ఇక్కడితో ఆగలేదు అనిల్ రావిపూడి. పాటల రిలీజ్ టైంలో వెరైటీ ప్రోమోలు కట్ చేయించి వదిలడం బాగా సక్సెస్ కావడంతో ఇప్పుడు రీల్స్ బాట పట్టాడు. వెంకటేష్ క్లాసిక్ సాంగ్స్ ని వాడుకుంటూ ప్రత్యేకంగా షార్ట్ వీడియోస్ చేయించాడు. ముందు జాగ్రత్తగా షూటింగ్ టైంలోనే చిత్రీకరించి సిద్ధంగా పెట్టుకోవడం ఉపయోగపడుతున్నాయి. ఎప్పుడో సూర్య ఐపీఎస్ లోని ఇళయరాజా పాటని చిన్న బిట్ గా షూట్ చేయడం అనిల్ టేస్ట్ కి నిదర్శనం. ఇంతకు ముందు బొబ్బిలిరాజా, జయం మనదేరా, చంటి గెటప్స్ ని టీమ్ తో వేయించి చేసిన ఇంటర్వ్యూ ముందు ట్రోలింగ్ అయినా తర్వాత సూపర్ హిట్ కొట్టింది. ఇంతగా వింటేజ్ వెంకటేష్ ని వాడుకున్న దర్శకులు ఈ మధ్య కాలంలో లేరు.

# కొత్త బిజినెస్ మొదలుపెట్టిన రానా భార్య..!



రానా భార్య మిహీక బజాజ్ అందరికి పరిచయమే. ఈమె బిజినెస్ ఫ్యామిలీ నుంచే వచ్చింది. రెగ్యులర్ గా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది రానా భార్య మిహీక. అయితే తాజాగా మిహీక ఓ కొత్త బిజినెస్ మొదలుపెట్టింది. ఫుడ్ స్టోరీస్ అనే ఫుడ్ కి సంబంధించిన బిజినెస్ కి ఫ్రాంచైజ్ తీసుకుంది. తాజాగా మిహీక ఫుడ్ స్టోరీస్ బ్రాంచ్ హైదరాబాద్ బంజారా హిల్స్ లో ఓపెన్ చేసారు.

ఈ షాప్ ఓపెనింగ్ కి రాజమౌళి, అతని భార్య రమా రాజమౌళి గెస్టులుగా వచ్చారు. రానా కూడా వీరితో వచ్చారు. అలాగే ఫరియా అబ్దుల్లా, సీరత్ కపూర్ మరికొంతమంది సినిమా సెలబ్రిటీలు కూడా ఈ ఫుడ్ స్టోరీస్ ఓపెనింగ్ కి వచ్చారు. తాజాగా రానా భార్య మిహీక రాజమౌళి, రమా రాజమౌళి, రానాలతో తన ఫుడ్ స్టోరీస్ షాప్ లో దిగిన ఫోటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ కొత్త బిజినెస్ మొదలుపెట్టినందుకు సంతోషం వ్యక్తం చేసింది.

# రాశిఖన్నా గ్లామర్ సూపరో సూపర్.....!



గ్లామర్ షో విషయంలో ఒక్కొక్కరికి ఒక్కో స్టైల్ ఉంటుంది. రాశి ఖన్నా ఫోటో షూట్ చూస్తే అమ్మడి స్టైల్ అర్థమవుతుంది. ఫాలోవర్స్ కి కావాల్సింది అందిస్తూ వారి అటెన్షన్ ని గ్రాబ్ చేయాలని చూస్తుంది. అందాల భామ రాశి ఖన్నా సౌత్ నార్త్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్ట్ లు చేస్తుంది. తెలుగులో ఐడెంటిటీ వచ్చినా కూడా ఎందుకో దాన్ని సరిగా వాడుకోలేకపోయిందని చెప్పొచ్చు. మద్రాస్ కేఫ్ తో తెరంగేట్రం చేసిన అమ్మడు టాలీవుడ్‌లో ఊహలు గుసగుసలాడే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. అప్పటి నుంచి యంగ్ హీరోలతో కలిసి నటిస్తూ అలరిస్తుంది. ఐతే స్టార్ మెటీరియల్ అయినా కూడా రాశి ఖన్నాకు ఏమాత్రం లక్ ఫేవర్ చేయలేదు. ఎన్టీఆర్, రవితేజ లాంటి స్టార్స్ తో నటించినా సరే ఎందుకో రాశి ఖన్నా స్టార్ రేంజ్ కి వెళ్లలేదు. ఐతే సినిమాలు, సీరీస్ లు ఎలా ఉన్నా కూడా అమ్మడు తన ఫోటో షూట్స్ తో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. లేటెస్ట్ గా రాశి ఖన్నా గ్లామర్ ఫోటో షూట్ సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. గ్లామర్ షో విషయంలో ఒక్కొక్కరికి ఒక్కో స్టైల్ ఉంటుంది. రాశి ఖన్నా ఫోటో షూట్ చూస్తే అమ్మడి స్టైల్ అర్థమవుతుంది. ఫాలోవర్స్ కి కావాల్సింది అందిస్తూ వారి అటెన్షన్ ని గ్రాబ్ చేయాలని చూస్తుంది అమ్మడు.

కచ్చితంగా రాశి కాస్త సీరియస్ గా ట్రై చేస్తే ఇప్పటికి కూడా అమ్మడికి మంచి ఛాన్స్ లు వస్తాయని చెప్పొచ్చు.

# జపాన్‌లో ప్రభాస్ రాజాసాబ్ ఆడియో లాంచ్..



ప్రభాస్ ఆల్మోస్ట్ అరడజను సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అయితే మారుతి దర్శకత్వంలో రాజాసాబ్, హను రాఘవపూడి సినిమాల షూటింగ్స్ తో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాలపై భారీ అంచనాలే ఉన్నాయి. రాజాసాబ్ సినిమా హారర్ కామెడీ జానర్, ప్రభాస్ మొదటి సారి హారర్ సినిమా చేయడం, ప్రభాస్ మొదటిసారి ముసలి పాత్ర చేయడంతో ఈ సినిమా కోసం ప్రేక్షకులు తెగ ఎదురుచూస్తున్నారు. రాజాసాబ్ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్.. ఇలా ముగ్గురు హీరోయిన్స్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి మోషన్ పోస్టర్, గ్లింప్స్ రిలీజ్ చేసారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్ రాజాసాబ్ గురించి ఆసక్తికర విషయాలు తెలిపాడు. తమన్ మాట్లాడుతూ.. బాహుబలి నుంచి ప్రభాస్ చేసినవన్నీ రెగ్యులర్ ఫార్మేట్ కి భిన్నంగా ఉన్నాయి కాబట్టి వాటిల్లో మాస్ సాంగ్స్, రెగ్యులర్ కమర్షియల్ సాంగ్స్ లేవు. రాజాసాబ్ కమర్షియల్ సినిమా. ఇందులో కమర్షియల్ సాంగ్స్, డ్యూయెట్ సాంగ్, ఐటెం సాంగ్ అన్ని ఉన్నాయి.

# ఆగం చేయకండి.. అమెరికా ఫ్యాన్స్ కు బాలయ్య హెచ్చరిక..

బాలకృష్ణ డాకు మహారాజ్ సినిమాతో సంక్రాంతికి రాబోతున్నారు. సాధారణంగా ఫ్యాన్స్ తమ ఫేవరేట్ హీరోల సినిమాలకు థియేటర్స్ లో ఏ రేంజ్ అల్లరి చేస్తారో తెలిసిందే. పేపర్లు ఎగరేయడాలు, కటౌట్స్, పాలాభిషేకాలు, బ్యానర్లు, టపాసులు.. ఇలా థియేటర్స్ వద్ద రచ్చ చేస్తారు. థియేటర్ లోపల కూడా పేపర్స్ ఎగరేసి, ఫైర్ క్రాకర్స్ తో హడావిడి చేస్తారు. అయితే అమెరికా వెళ్లినా మన వాళ్ళు మారకుండా అక్కడ కూడా ఇలాగే చేస్తున్నారు. గతంలో చాలా సినిమాలకు అమెరికాలో మన తెలుగు వాళ్ళు చేసిన రచ్చ వీడియోల రూపంలో వైరల్ గా మారాయి. ముఖ్యంగా బాలయ్య సినిమాలకు అయితే హడావిడి ఓ రేంజ్ లో ఉంటుంది.

గతంలో అఖండ సినిమాకు తమన్ కొట్టిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కి, ఫ్యాన్స్ చేసిన రచ్చ కు అక్కడ థియేటర్స్ లో ఊఫర్స్ పేలిపోయాయి. అప్పట్లో ఈ విషయం పెద్ద రచ్చ అయింది. దీంతో దీనిపై బాలయ్య తాజాగా స్పందించారు.



Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com